# ఆంతర్యం

వియోగి

"సావిత్రిలేచి పోయిందీ....ట!" అన్నాడు కిరణ్ మాటల సందర్భంలో ఉన్నట్లుండి.

అతను నేను కల్సుకొని నెలపైగా అయింది.

' ' ఏ సావిత్రి!''

నేను నిర్ఘాంత పోయి అడిగాను.

"ఎంతమంది సావిత్రులు తెల్సు నీకు?" అతని వాడి ప్రశ్న

"అంటే... నువ్వనేది..... మన శాస్త్రిగారి కూతురు...." షాక్ తిన్నాను.

"అక్షరాలా... ఆ సావిత్రే లేచి పోయింది" తాపీగా చెప్పాడు కిరణ్.

"సావిత్రి... అంత పని చేసిందా? ఎవరితో....." తడారి పోతున్న గొంతుకతో అడిగాను.

"ఓ కులంతక్కువ వాడితో......" ఛీత్కారంగా అన్నాడు.

"ఆఁ!..... హాస్యమాడుతున్నావా?" మెదడు మొద్దుబారి పోతుంటే అడిగాను.


"గురువుగారి విషయంలో హాస్యాలా... అయినా ఇది నీకు ముందే తెల్సనుకున్నాను" చెప్పాడు కిరణ్!

"హూఁ! శాస్త్రి గారు ఎలా ఉన్నారు?" హృదయం భారమై అడిగాను.

"పోయి చూసిరా.... నీకే తెలుస్తుంది" నా జవాబు కోసం ఎదురు చూడకుండా వెళ్ళిపోయాడు. వాడొట్టి మెటేరియలిస్టు దేనికీ పెద్దగా చలించడు.

శాస్త్రిగారిది నీళ్ళను నిప్పులతో కడిగే వంశం, నాకు, వాడికి ఆ మాట కొస్తే మా లాంటి చాలామందికి వారు గురుతుల్యులు. ఏ సలహాకైనా వారి దగ్గరికి వెళుతుంటాం. ముహూర్తాలు పెట్టుకోవాలన్నా.... జాతకాలు చెప్పించు కోవాలన్నా.... మంచి చెడుకు, వారి దగ్గరకే వెళ్ళుతుంటాం.

ఆరడుగుల ఆజానుబాహువు మెడలో రుద్రాక్షలతో... నుదిటి మీద విభూది రేఖలతో మంచి వర్చస్సుతో.....



అపర రుద్రుడిలా వెలిగి పోతూ ఉంటారు.

ఆయన భార్య లక్ష్మీదేవి. ఆయనకు తగిన ఇల్లాలు. మొహాన రూపాయి బిళ్ళంత బొట్టు పెట్టుకుని పార్వతీ దేవిలా కళకళలాడిపోతుంది. కాని ఆయన సగటు బడిపంతులు. అంటే ఆయనింట్లో దారిద్ర్య దేవత నాట్యం చేయక పోయినా మహాలక్ష్మి మటుకు కటాక్షించలేదు. అయినా ఆయన సంతృప్తితో జీవితం కొనసాగించేవారు.

వారికి ఉన్న ఏకైక సంతానం సావిత్రి. ఆమెను ఉన్నంతలో అల్లారు ముద్దుగా పెంచారు. తల్లితండ్రుల అడుగు జాడల్లో కను సన్నల్లో పెరుగుతూ.... పురాణాలు.... శాస్త్రాలు... మత గ్రంథాలు... భక్తి రస గాథలు వల్లె వేస్తూ ఇంటికి వచ్చే మా లాంటి మధ్య వయస్కులతో అంటే తనకంటే పది పదిహేనేళ్ళ పెద్దవాళ్ళతో వాదనలు చేస్తూ ఉంటుంది. మొత్తం మీద ఆ వాడలో శాస్త్రిగారి కుటుంబానికున్న పలుకుబడి... గౌరవం అపారం!

అటువంటి కుటుంబంలో ఇంత అనూహ్య పరిణామమా? అది నేను ఉద్యోగ రీత్యా ఒక నెల ట్రైనింగ్‌కని మద్రాసుకుపోయి వచ్చిన కాలంలో జరిగిన పెను మార్పు.

మనసుని నిలుపుకోలేక, ఆదరాబాదరాగా శాస్త్రిగారింటికి వచ్చాను.

"శాస్త్రిగారు!" పిలిచాను అలికిడి లేదు. ఎప్పుడూ ఆయనే బయటకు వచ్చి ఆహ్వానించేవారు లేదా సావిత్రి లోపలికి రమ్మనేది.

రెండుసార్లు పిలిచి, నేను దగ్గరకేసున్న తలుపులు తోసుకుని లోపలికి వెళ్ళాను. నిశ్శబ్దంగా ఉంది ఇల్లు.

హాల్లో ఓ మూల మంచం మీద శాస్త్రిగారు చాప చుట్టలా పడుకుని ఉన్నారు, లక్ష్మీదేవి గారు లోపల ఎక్కడో ఉన్నట్లున్నారు. అలికిడికి తల ఇటు తిప్పి చూశారు శాస్త్రిగారు.

నన్ను చూడగానే, ఆయన మొహంలో ఓ వెలుగు కనిపించింది మరు క్షణం కన్నీటి పొర కమ్మేసింది. నన్ను చూసి మంచం నుంచి లేవబోయి - చేతకాక కాబోలు- ఆ ప్రయత్నం విరమించుకున్నారు.

"ఏమైంది మీకు? ఆరోగ్యం బాగోలేదా?" కుర్చీ ఆయన దగ్గరకు లాక్కుని అడిగాను.

"అన్నీ పోయాయి" చేతిని తిప్పుతూ అన్నారు శూన్యంలోకి చూస్తూ.

"ఏం జరిగిందండి?" సందేహిస్తూ అడిగాను.

"ఏం చెప్పమంటావు? సావిత్రి.... సావిత్రి...." ఆయన గొంతు దుఃఖంతో పూడుకుపోయింది.

"ఊరు కోండి... అస్సలు ఏమైంది?" ఓదారుస్తూ అడిగాను.

"నా తలరాత! ప్చ్! ఇంత మందికి జాతకాలు చెప్పాను - కానీ నా జాతకం - నా కూతురి జాతకం చెప్పుకోలేక పోయాను - అది ఇలా చేస్తుందని ముందుగా తెల్సుంటే చిన్నప్పుడే గొంతు పిసికి చంపి ఒక్క ఏడ్పు ఏడ్చి నాకు బిడ్డలు పుట్టలేదని సరిపెట్టుకునేవాడ్ని! ఇన్నేళ్ళు అల్లారు ముద్దుగా పెంచి" హుహుహు చెప్పే ఓపిక లేక ఆయన ఊరుకుండిపోయారు, గుండె మీద చేత్తో నొక్కుకుంటూ.

"రమేష్! ఆయన్ను ఎక్కువ మాట్లాడించద్దు. డాక్టర్లు విశ్రాంతి కావాలన్నారు. అక్కడికి వచ్చిన - లక్ష్మీదేవిగారు చెప్పారు. టేబులు మీదున్న టాబ్లెట్టు తీసి - మంచి నీళ్ళ గ్లాసు అందుకుని - శాస్త్రిగారితో ఆ మాత్ర మింగించారు.

నన్ను లోపలికి రమ్మని సైగ చేస్తే - ఆమె వెంట వంటింట్లోకి వెళ్ళాను.

"బాబూ! ఆయన దగ్గర ఈ విషయాలు ఎత్తొద్దు. ఆయనిప్పుడు గుండె జబ్బు మనిషి చచ్చి బ్రతికారు. ఎటువంటి ఆవేశం ఆయనకు కలిగించకూడదు" ఆమె కళ్ళొత్తుకుంది.

"గుండె జబ్బా! హార్ట్ ఎటాక్! వచ్చిందా!" అడిగాను. తలూపింది "పిడుగులాంటి మాష్టారికి ఈ గుండె జబ్బు ఏంటండీ? ఎప్పుడొచ్చింది? బాధగా అడిగాను.

"మా కర్మ! మేం చేసిన పూజలకు - నోచిన నోములకు ఇదీ ఫలితం! పైట కొంగుతో కన్నీళ్ళొత్తుకున్నారామె!

"అస్సలు ఇదంతా ఎలా జరిగింది?" తేరుకుంటూ అడిగాను.

"పోయేకాలం - ఆ మాయల ఫకీరుగాడు అమ్మాయికి ఏ మందు పెట్టాడో ఏమో- వల్లో వేసుకున్నాడు - చెప్పా చేయకుండా రాత్రికి రాత్రి తుర్రుమని పారిపోయింది ఉత్తరం రాసి పెట్టి. నాకోసం వెతకద్దు - నేను శశితో వెళ్ళిపోతున్నాను - పెళ్ళి చేసుకుని హాయిగా ఉంటాము - మీ కోపం తగ్గిన తర్వాత ఉత్తరం వ్రాస్తాను అని వ్రాసి పెట్టి లేచిపోయింది అన్నారు ఆమె విషాదంగా.

"ఆ మాయల ఫకీరును ముందుగా మీరు గమనించలేదా... అస్సలు ఇంటికెందుకు రానిచ్చారు!" అమాయకంగా అడిగాను.

"నా మొహం! ఎక్కడో దార్లో పరిచయంట. ఈ చచ్చింది రహస్యంగా దాచి పెట్టింది. ఎన్నాళ్ళ నుండి జరుగుతున్నదో ఈ చాటు మాటు వ్యవహారం" బాధగా అన్నారు.

"ఆ పోనీ..... తరువాతనైనా మీరు పోయి....." నసిగాను.

"అదీ అయిపోయింది... జరిగిపోయిందేదో జరిగిపోయింది. ఆ తాళిని తెంచేసి రావే అని పిలిస్తే ససేమిరా రానంది. చావైనా బ్రతుకైనా వాడితోనేట." ఆమె ఏడ్చేశారు.

వారి విషాదాన్ని.... బాధల్ని మరింతగా పెంచడం మంచిది కాదనిపించి వచ్చేశాను. వారి బాధను చూసిన తరువాత నా గుండె బరువెక్కింది.

ఓ సంవత్సరం కాలగర్భంలో కల్సిపోయింది.

నేను ఆఫీసు పని మీద అనంతపురం వెళ్ళాల్సి వచ్చింది. పని ముగించుకుని కర్నూలు బస్సు కోసం బస్సు స్టేషన్‌లో నిలబడున్నాను గంటపైన అయినా బస్సు రాలేదు.


చాలా చిరాకుగా తిరుగుతూ ఉంటే ఓ పరిచిత కంఠస్వరం వినిపించింది.

"రమేష్‌గారూ! బాగున్నారా?"

గిర్రున వెనక్కి తిరిగి చూశాను.

సావిత్రి! నవ్వుతూ నిల్చునుంది.

నాకు కంపరం పుట్టింది - లేచి పోయి తల్లితండ్రులను కాల్చుకు తింటున్నది చాలక



ఈనవ్వొకటా! తిరస్కారంగా తల తిప్పుకున్నాను.

కాని సావిత్రి మటుకు నన్ను వదిలేట్లు లేదు.

"మా పెళ్ళికి మిమ్మల్ని పిలవకపోవడం నా తప్పే! కోపం వచ్చిందాండి" ఆమె అడిగింది.

"సావిత్రి! దయచేసి నాతో మాట్లాడకు" కరుగ్గా అన్నాను.

ఇంతలో మా బస్సు వచ్చింది. గబగబా అటువైపుకు అడుగు వేశాను.

కాని నా ముందు కొచ్చి రెండు చేతులు అడ్డంగా సాచి నిలబడింది సావిత్రి. నేను తప్పుకోబోయాను. కాని ఆమె అవకాశం యివ్వలేదు.


"ఏంటిది?" మొహం చిట్లించాను.

"రాక రాక మా ఊరుకొచ్చారు - మా యింటికొచ్చి పొండి ఒక్కసారి" బ్రతిమాలుతూ అడిగింది.

"అడ్డమైన వాళ్ళ ఇళ్ళకు నేను రాను" విసురుగా చెప్పాను వీలైనంత కసిగా.

"మీరు అలా అంటే ఈ బస్సు కింద పడి చస్తాను" రోషంగా సావిత్రి అలా అనేసరికి నేను మామూలు మనిషిని అయిపోయాను. అయిష్టంగా, మౌనంగా, ఆమె వెంట నడిచాను. ఆమె భర్త వైపు బంధువులొస్తే వారిని సాగనంపడానికి బస్సు స్టేషన్‌కు వచ్చిందట ఆయనకు తీరిక లేక పోతే. నన్ను చూసి ఆగింది తను. ఇంటికి ఆటో మాట్లాడింది. విధిలేక అనుసరించాను.

ఓ మంచి ఖరీదైన బంగళాలోకి వచ్చాను ఆమె వెంట. ముట్టుకుంటే మాసి పోయేటట్లున్న ఓ సోఫాలో కూర్చున్నాను. తాను ఫ్రిజ్‌లోంచి చల్లటి నీళ్ళు తెచ్చి ఇచ్చింది. దాంతో పాటు జ్యూస్





కూడా కలిపి తెచ్చింది. తాగిన తరువాత నా మెదడు పని చేయడం ప్రారంభించింది. వర్తమానానికి వచ్చాను.

"నాన్నగారు ఎలా ఉన్నారు?" సావిత్రి అడిగింది ఎంతో ప్రేమగా.

"ఎలా ఉంటారు - నీ పుణ్యమాని మంచం ఎక్కారు. ఇవ్వాళో రేపోలాగున్నారు - నీ మూలంగా ఆయనకు హార్ట్ ఎటాక్ వచ్చింది. తెలుసా?" కోపాన్ని ఆపుకోలేక అరిచాను.

సావిత్రి కళ్ళెంబడి నీళ్ళు తిరిగాయి.

"అమ్మ ఎలా ఉంది?"గాద్గదికంగా అడిగింది.

"ఇంకా గుర్తున్నదా? నిన్ను కన్న పాపానికి నలుగురిలో తలెత్తుకు తిరగలేకపోతున్నది... ఇంక తను మంచం పడితే శాస్త్రిగారికి చేసే వాళ్ళెవరని లేచి తిరుగుతున్నది ఆ మహాఇల్లాలు..." దెప్పి పొడిచాను.

సావిత్రి కళ్ళు శ్రావణ మేఘాలయ్యాయి. గుడ్లప్పగించి చూస్తూ ఉండిపోయాను.

"అడిగినట్లు చెప్పండి" కాసేపటికి తేరుకుని చెప్పింది.

నాకనిపించింది ఆమెకు తల్లి తండ్రుల మీద కాస్తయినా ప్రేమ తగ్గలేదని.

"రమేష్‌గారు! ఈ పూటకు మా ఇంట్లో భోజనం చేసి వెళ్ళండి" దీనంగా అడిగింది.

"ఛీ! ఛీ! కులభ్రష్టుల యింట్లో నేను తిండి తినను" వికారంగా మొహం పెట్టి అన్నాను.

సావిత్రి షాక్ తింది. నేను ఆ మాట అంటానని ఆమె ఊహించినట్టులేదు.

"హోటల్ వాళ్ళకంటే తీసిపోయామా?" హీనస్వరంతో అంది.

"మూడు పూటలా గాయత్రిని స్మరించే వాడిని అపవిత్రుల ఇంట్లో భోజనం చేస్తే నాకున్న దైవ శక్తి కాస్తా పోతుంది" కొంచెం భయంగా అన్నాను.

"మీకిష్టమైన చికెన్ చేస్తాను తింటారా?" సావిత్రి సూటిగా అడిగింది.

నేను దిమ్మెర పోయాను.... ఇది నేను ఊహించనిది. నేను దొంగచాటుగా నాన్‌వెజ్ తీసుకుంటానని నాకు తెల్సినంత వరకు ఎవరికీ తెలీదు. ఈమె ఎలా పసికట్టిందో!

సిగ్గుతో తలవంచుకున్నాను.

"నాకెలా తెల్సిందనా? ఎందుకు లేండి..... మీ లాంటి చాలా మంది పిల్లి కళ్ళు మూసుకుని పాలు తాగుతూ తన్ను ఎవరూ చూడలేదు అనుకున్నట్లు, అనుకుంటూ ఉంటారు.... అయినా హోటల్లో కూడు తినేవారికి ఇంట వంట నచ్చదు లేండి...." సావిత్రి చెప్పింది.

"అమ్మా! సావిత్రీ! నువ్వు! నువ్వు! చికెన్ చేస్తావా? వెల్లుల్లిని కూడా ముట్టని శ్రోత్రియ కుటుంబంలోంచి వచ్చి..... కోడికూర చేస్తున్నావా?" అప్రయత్నంగా కళ్ళ వెంట నీళ్ళు కారాయి ఆమె దుస్థితికి.

"ఏం తప్పేం! ఆయన కోసం....." సావిత్రి చెప్పింది.

"ఛీ! ఛీ! ఎంత దిగజారి పోయావు.... కొంపదీసి..... నువ్వు కూడా తింటున్నావా?" అనుమానపడ్డాను.

## లిసా ప్రేమగోల

'టక్కరి దొంగ' చిత్రంలో తెలుగు ప్రేక్షకులను కనువిందు చేసిన ముంబాయి భామ లిసారే ప్రేమలో పడింది. చంకీపాండే సోదరుడు చిక్కీ పాండే, లిసారేల మధ్య ప్రేమాయణం చాలా ఘాటుగా సాగుతోంది. అయితే చిక్కీపాండేకు ఇంతకు ముందే మోడల్ డియానేతో వివాహం అయింది. చిక్కీపాండే డియానేతో విడాకులు తీసుకుని లిసారేను పెళ్ళి చేసుకునే ఉద్దేశ్యంలో ఉన్నాడు. లిసారే పెళ్ళికి రెడీగా ఉంది.

## మళ్ళీ ప్రేమలో

కరీనా కపూర్, ఫర్దీన్‌ఖాన్‌ల మధ్య రొమాన్స్ జోరుగా సాగుతోందని బాలీవుడ్ భోగట్టా. 'ఖుషీ' చిత్రం సందర్భంగా వారిద్దరూ బాగా చేరువ య్యారని, ఫర్దీన్ కరీనాలు ప్రేమలో పూర్తిగా మునిగిపొయ్యారని అంటున్నారు. వాళ్ళు కలిసి రెస్టారెంట్స్‌కు, డిస్కోలకు వెళుతున్నారని బాలీవుడ్ సమాచారం. (పాపం కరీనాకు ఇన్నాళ్ళకు ఒక పెళ్ళికాని హీరో దొరికాడు.)

"మీ లాగా నాకేం భయం లేదు. వారి కోసం తింటున్నాను. మాంసం తింటున్నామని ఎముకలు మెళ్ళో వ్రేలాడేసుకోలేదు. అలాగని మీలాగా పోజులు పెట్టి బుకాయించలేదు" సావిత్రి ఏ మాత్రం సంకోచపడకుండా నిజం ఒప్పుకుంటున్నది.

నా తల తిరిగి పోయింది. సావిత్రిలో ఎంత మార్పు? గతం గుర్తుకొచ్చింది లీలగా.

ఆమెకు జబ్బు చేసి నీరసంగా ఉన్నప్పుడు డాక్టర్లు రెండు మూడు నెలలు కోడి గ్రుడ్లు తినమని సలహా యిచ్చారు. శాస్త్రిగారు బిడ్డ కోసం తన నియమాలను కాస్త పక్కకు నెట్టి ఆ గ్రుడ్లను తెచ్చి యిచ్చారు. కాని సావిత్రి తిననని నిరాకరించింది. ఆవాసనకే.... బలవంతం చేస్తే.... భళ్ళున వాంతి చేసుకుంది ఇదంతా మూడు నాలుగేళ్ళ కిందటి మాట!

"సావిత్రీ! ప్రేమించడానికి నీకు మీ కులంలో యువకులే దొరకలేదా? నీకు తగ్గ మొగుడు లేడనుకున్నావా? మీ నాన్న నీకు పెళ్ళి చేయలేడనుకున్నావా?" ఆమె కళ్ళల్లో చూస్తూ అడిగాను. శాంతంగా. కాని అది ఎంత వాడియైన బాణమో నీకు తెల్సు. పైగా గుండెకు గురి చేశానుగదా.

ఆమె ఒక్క నిమిషం విలవిల్లాడి పోయింది. ఆమె చేతి వేళ్ళు స్టీలు గ్లాసు చుట్టూ బిగుసుకోవడం చూశాను. గోడకానుకుని నిలబడింది పడిపోకుండా సావిత్రి. ఆమె మొహం జేవురించింది.

తరువాత ఎందుకడిగానా అని విచారించాను.

"కొన్ని ప్రశ్నలకు జవాబు లేదు" ఆమె తనని ఎంతో కంట్రోల్ చేసుకుంటూ అంది కాని అది సరైన సమాధానం కాదని ఆమెకే అన్పించినట్లుంది.

"పోనీ.... ప్రేమించినప్పుడు - లేచి పోవడమెందుకు. ధైర్యంగా నాన్నగారితో చెప్పి పెళ్ళి చేసుకోలేక పోయావా?" బాధగా అన్నాను తను ఎంతో పొరపాటు చేసిందో గ్రహించమన్నట్లు.

ఆమె చివ్వున తలెత్తి చూసింది. ఆ చూపుల్లో ఎంత అమాయకుడివి అన్న భావం ఉంది.

"శవాలు పడతాయండి" భయంగా చెప్పింది.

"నాన్నగారికి తెలిసే ప్రాణం తీసెయ్యరూ! అందుకే ఇలా... కాని ఇక్కడికొచ్చిం తర్వాత మేం శాస్త్రోక్తంగా గుళ్ళో పెళ్ళి చేసుకున్నాం!" చెప్పింది తాళిని బయటకు చూపిస్తూ కళ్ళకు అద్దుకుంటూ.

"అయితే... ఇప్పుడు శవాలు పడవని నమ్మకం కుదిరిందా! నువ్వు చేసిన పనికి మీ నాన్నగారు - అమ్మగారు ఎక్కువ కాలం బతకరు. వాళ్ళని ఇలా జీవచ్ఛవాలు చేయకుండా ఉండాల్సింది. కనీసం వాళ్ళు కళ్ళు మూసేదాకన్నా ఊరుకుంటే బాగుండేది" చల్లగా అన్నాను.

"అప్పుడు పెళ్ళి ఎందుకండి - ముసలాళ్ళమై పోతాం...." బయట అలికిడి విని సావిత్రి సర్దుకుని ఎదురు వెళ్ళింది చకచకా.

నల్లగా, పొట్టిగా ఉన్న ఓ ఖరీదైన యువకుడు లోపలికి వచ్చాడు. కాకి ముక్కుకో దొండ పండు "మా వారు! శశిధర్! ఈయన రమేష్ గారని" పరిచయం చేసింది.


అతను నిర్లక్ష్యంగా నావంక చూసి షేక్ హ్యాండ్ కోసమన్నట్లు చెయ్యి జాపాడు. అతని చేతి నలుపు నాకంటుతుందన్న భయంతో నా చెయ్యి వెనక్కి తీసుకున్నాను. నమస్కారం పెట్టి ఊరుకున్నాను. అతనిలో ఏం చూసి ప్రేమించింది?

"ఎప్పుడొచ్చారు?" అడిగాడు శశిధర్.

"ఇప్పుడే వెళుతున్నాను" చెప్పాను ముక్తసరిగా.

"పది నిమిషాలు వెయిట్ చేస్తే నా కార్లో మీకు లిఫ్టు ఇస్తాను ఉండండి." అతను నా సమాధానం కోసం ఎదురు చూడకుండా లోపలికి వెళ్ళాడు. సావిత్రి నావంక జాలిగా చూసి లోపలికి వెళ్ళింది. అప్సరసకు యమకింకరుడు దొరికినట్లుంది. నిజంగా ప్రేమ గుడ్డిదే - అంతే కాదు చెవిటిది కూడ.

శాస్త్రి గారు - చాలా సంబంధాలు చూశారు. కాని ఏదో వంక పెట్టి తిరస్కరించేది. అన్నీ కుదిరితే కట్నం దగ్గర మడత పేచి. బడిపంతులుగా రిటైరై చేతికందిన డెభైవేలు ఆమె పెళ్ళికని అట్టే పెట్టారు. అదే ఆయన ఆస్తి కాకపోతే శిథిలావస్థలో ఉన్న యిల్లును కూడా తాకట్టు పెట్టి పిల్ల పెళ్ళి చేద్దామనుకున్నారు శాస్త్రిగారు.



"కాఫీ!" సావిత్రి మొగుడు అందించాడు. గతిలేక తీసుకున్నాను.

"అత్తగార్ని మామగార్ని అడిగినట్లు చెప్పండి. మేం చాలా సుఖంగా ఉన్నామని చెప్పండి" అతను తాపీగా అంటూ ఉంటే నాకు ఒంటి మీద తేళ్ళు జర్రులు పాకుతున్నట్లుంది.

"నాకు దేనికీ లోటు లేదని చెప్పండి" సావిత్రి అంది. తాగుతున్న కాఫీ గొంతుకడ్డుపడి పొరబోయింది.

"మీరన్నా సుఖంగా ఉండండి" బరువుగా అన్నాను.

"ఒకే! నేను కారు బయటికి తీస్తాను" అతను బయటకెళ్ళాడు కారు కీసు చేతిలో ఊపుకుంటూ విలాసంగా.

"రమేష్‌గారు! నాన్నగార్ని నా పెళ్ళి కోసం దాచిన డబ్బును సద్వినియోగం చేయమనండి. షేర్లుకాని - మ్యుచువల్ ఫండ్స్ కాని కొనమనండి. అదే ఆయనకు జీవనాధారం!" ఆమె గొంతులో జీర నన్ను కదలించింది.

హఠాత్తుగా నా కనిపించింది - సావిత్రి శాస్త్రిగారు తెచ్చిన ఏ సంబంధం చేసుకున్నా ఇంత ఐశ్వర్యంతో తుల తూగుతుండేది కాదని. వాళ్ళంతా దిగువ మధ్య తరగతి వరుళ్ళే! అంతేకాదు శాస్త్రిగారు తాను తెచ్చిన ఏ సంబంధం చేసినా తనకున్న ఆస్తి మొత్తం తెగ నమ్ముకుని ఉండేవారు. సగటు మధ్య తరగతి మనిషి అప్పుల్లో పుట్టి అప్పుల్లో చస్తాడు.

"ఎప్పటికైనా నాన్నగారు మమ్మల్ని పిలుస్తారని ఆశతో ఎదురు చూస్తూ బతుకుతుంటాను" విషాదంగా నవ్వింది సావిత్రి.

బయట కారు హారన్ మోగింది నన్ను రమ్మని.

"బై" చెప్పి బయటకు వచ్చాను. సావిత్రి తెలివి గలది గుర్తించని త్యాగం చేసింది. తను పైకి ఎగబాకింది తన వాళ్ళను దరిద్రులు కాకుండా అడ్డుకుంది. ప్చ్! కాని ఎవరు సుఖపడుతున్నారు?

కారు ఎక్కుతూ సావిత్రిని చూశాను. ఆమె కళ్ళల్లో తుపాన్ వరదలు! ఆమె ఆంతర్యం నాకు బోధపడింది. ❀

## తెలుగులో మిస్‌వరల్డ్

మిస్‌వరల్డ్ ప్రియాంకాచోప్రా నటించిన చిత్రం బాలీవుడ్‌లో ఇంతవరకూ విడుదల కాలేదు. కానీ తెలుగులో ఆమె నటించిన చిత్రం 'అపురూపం' షూటింగ్ దాదాపుగా పూర్తయింది. త్వరలో ప్రియాంకాచోప్రా తెలుగు ప్రేక్షకులకు కనువిందు చెయ్యనుంది. ప్రియాంకతోపాటు పలువురు నూతన నటులు ఈ చిత్రంలో నటిస్తున్నారు.